# అబ్బునాథం అపరాధం

'నాగులు'

*కోరిక చిన్నది. అయినా తీర్చుకోవడం సులభం కాదు. చెడు కానప్పుడు రవంత మోసం తలపెట్టితే, ఎవరికీ నష్టం వాటిల్లనప్పుడు—తప్పేముంది? కాని ఫలితాన్ని సాధించడం అంత తేలికా?*

---

డిసెంబరు నెల. చలి విపరీతంగా ఉంది. లాయరాఫీసులో గుమాస్తాగిరి వెలగబెడుతున్న అబ్బునాథం హుషారుగావచ్చి తలుపుతీశాడు, రాత్రి తొమ్మిదిన్నర గంటలకు. గుడ్డలు మార్చుకుని పక్క పరిచాడు. కూర్చుని ఆఫీసు ఫైళ్ళు తెరిచాడు. అన్నీ అర్జంటు, వెరీ అర్జంటు కాగితాలే. యాంత్రికంగా వ్రాయడం మొదలు పెట్టాడు.

ఇంతలో తన ప్రక్క గదిలోనుంచి కిలకిలలు, గుసగుసలు ఆరంభించాయి. వ్రాస్తూ వ్రాస్తూన్న కలం ఎదురుతిరిగింది. భావప్రవాహం ఆగిపోయింది. సిగరెట్ వెలిగించాడు. నవ్వులు మరీ జోరుగా వినిపిస్తున్నాయి. ఏమిటబ్బా? తను ఆ గదిలో ప్రవేశించి మూడు నెల్లయినా ఎప్పుడూ ఇలాటివి వినబడలేదే? మళ్లీ మాటలు వినిపిస్తున్నాయి. ఏమిటో... వినాలనిపించింది. నెమ్మదిగా, తన గదికీ, ప్రక్కగదికీ ఉన్న తలుపుకు చెవి ఆనించి వినబోయాడు. తలుపేసిన శబ్దం వినిపించింది. కంగారుపడి లేచాడు. అటూ ఇటూ చూశాడు. ఫైళ్ళు కట్టేసి, లైటార్పి, తన గది తలుపుమూసి మళ్లీ ఆ తలుపు దగ్గర చేరబడ్డాడు.

"చూడు, కమలా! ఈ చీర ఏభై రూపాయలు. నీ పసిమి రంగుకు సరిగ్గా అతుకుతుంది".... అని వినిపించింది.

'కమలా? అంటే....గృహస్థుగా రమ్మాయి. పెళ్ళైందన్న మాట! ఇంకా చదువుకుంటూంటే పెళ్లి కాలేదనుకున్నానే; అరెరెరే...' అనుకున్నాడు అబ్బునాథం. ఇంతలో మళ్లీ వినిపించింది.

"అదేం చూస్తావు? ఇది చూడు. ఆ చీరకు అతికే జాకెట్! ఈ రెండింటిమీదా సరిపోయే



నెక్లెస్....."

"అబ్బ! చాలా బాగున్నాయండీ. ఎంతండీ ఈ నెక్లెస్?"

"ఆఁ! ఎంతలే! ఐదొందల ఎనభై రూపాయలు మాత్రం."

'అయ్య బాబోయ్!' అనుకుని చలికిల బడ్డాడు అబ్బునాథం. మళ్లీ వినిపిస్తున్నది సంభాషణ.

"ఎందుకండీ? ఇంత డబ్బెట్టి.... ఇవన్నీను?"

"నా ప్రణయదేవతకు అలంకరించి, ఈ లైట్ల వెలుగులో కళ్లారా చూసి మురిసిపోదామని" అంటూ వచ్చింది పురుషకంఠం.

"చాల్లెండి! కవిత్వంకూడా మొదలు పెట్టారు. డబ్బు ఖర్చుచేస్తేనేగాని కవిత్వం రాదేమిటి?" అంది స్త్రీకంఠం.

"ఈ పదినెల్లనుంచి ఒంటరిగా ఉంటున్నావా? వచ్చే వెంజీతం మూడువందల రూపాయలూ నా ఒక్కడికీ ఏం ఖర్చౌంటుంది చెప్పు? అదిసరేగాని.... ఒక్కసారి ఈ తెల్ల నైలాన్ చీరె, ఆ జాకెట్టు, నెక్లెసూ ధరించి దర్శనమియ్యవూ..ఒళ్లంతా కళ్లుచేసుకు చూస్తాను!.... ఒక్క........కూడా......"

"అబ్బ! ఉండండి" అంది స్త్రీకంఠం. గాజులు గలగలమన్నాయి.

అబ్బునాథానికి చలెక్కువైంది. నోరుతెరిచి వెల్లకిలా పడిపోయాడు ప్రక్కమీద. ఇక మాటలే వినపడ్డం లేదు. చెవులు పనిచెయ్యడం మాని వేశాయి. పడక సరిగా కుదరడంలేదు. పక్కను దున్నడం మొదలుపెట్టాడు. అదేగనక పొలమైతే ట్రాక్టరుకన్నా బాగా దున్నగలిగేవాడే. అతనికి నిద్ర పట్టిందో లేదో చెప్పడం కష్టం గాని తెల్లవారేసరికి అతని పక్క అతని కాళ్లదగ్గరున్న మాట వాస్తవం.

*   *   *   *

"అయ్యా ఏ—సెర్ గుమాస్తాగారూ! అయ్యగారు పిలుస్తున్నారు" అన్నాడు ఆఫీసు ప్యూను జకరయ్య.

హడావుడిగా పరుగెత్తాడు అబ్బునాథం.

"ఏ సీటులో కాగితాల పరిస్థితేమిటోయ్?" అడిగాడు తాసిల్దారు.

"ఫర్వాలేదండి. ఒక్క వారంరోజుల్లో అప్ టుడేట్ చేసేస్తానండి" అన్నాడు అబ్బునాథం.

"వెరీగుడ్. వారంకాదు పదిరోజులు తీస్కో. నీకు రెడ్ ఎంట్రీ ఇస్తాను" అన్నాడు ఆఫీసరు.

"థాంక్స్ సార్" అని వచ్చేశాడు అబ్బునాథం.

మళ్లీ కాగితాలు ముందరేసుక్కూచున్నాడు. వ్రాయడం కుదరడం లేదు. మనస్సు అత్తారింటికి వెంచేసింది. భార్యతో దోబూచులాడుతున్నది. ఏదో చలేసినట్లనిపించింది. ఏమీ వ్రాయ బుద్ధెయ్యడంలేదు. శూన్యంలోకి చూడడం మొదలుపెట్టాడు.

"అయ్యా! ఈ కాగితానికి వెంటనే సమాధానం వ్రాసి తెమ్మన్నారండి" అంటూ ఒక కాగితం



మంచుముసుగు (ఢిల్లీ లాల్ ఖిల్లా) ఫోటో — ఎల్. ఆర్. గ్రోవర్ (రొహతక్)

అబ్బునాథానికి అందించాడు జకరయ్య. డెప్యూటీ కలెక్టరు కాగితమది. వెంటనే సమాధానం వ్రాయడం మొదలుపెట్టాడు.

"డియర్ సుజాతా! నీదగ్గరినుంచి ఉత్తరాలే రావడంలేదు... అరె! ఆరంభంలోనే హంస పాదా? ఛ ఛ! లేకపోతే నాభార్య పేరుతో ఉత్తరం వ్రాయడమేమిటి?" చుట్టుపక్కల చూసి ఆ కాగితం చించేసి, ఆ ముక్కలన్నీ జేబులో కుక్కుకున్నాడు, కంగారుగా. వేరే సమాధానం వ్రాసి జకరయ్యకిచ్చి పంపేశాడు.

"ఏమిటండీ! కంగారుగా ఉన్నట్టున్నారు?" ప్రశ్నించింది ఎదురుగా ఉన్న లేడీ టైపిస్టు.

"అబ్బే! ఏంలేదు మిస్ సుజాతా.... ఓ! ఐయామ్ సారీ.... మిస్ సుశీలా...." ఇంకా కంగారు పడ్డాడు.

కిలకిలా నవ్వింది లేడీ టైపిస్టు.

దబ్బకాయంత మొహమూ నిమ్మకాయంత అయింది అబ్బునాథానికి. మొహానికి పట్టిన చెమటను తుడిచి పిండాడు. తన పని తను చూసుకుంటున్న లేడీ టైపిస్టువంక ఒకసారి చూశాడు. తన శరీరం అదో మాదిరిగా అయింది. చలేయడం మొదలు పెట్టింది. మనసు మళ్లీ అత్తారింటికి వెళ్లిపోయింది.

"సార్! ఇది చదివి దీనిమీద సంతకం పెట్టండి" అంటూ జకరయ్య ఒక కాగితం ముందరపెట్టాడు.

అబ్బునాథం చదవడం మొదలుపెట్టాడు.

"ఆఫీసులో పని చాలా ఎక్కువగా ఉన్నందున గుమాస్తాలందరూ ఎట్టి పరిస్థితుల్లోనూ, పండుగలు, ఆదివారాలుకూడా ఆఫీసుకు వచ్చి యథావిధిగా పనిచేయవలెను. ఎవరికీ ఎటువంటి సెలవులూ మంజూరు చెయ్యబడవు. ఇది నెల రోజులవరకూ అమలులో ఉండును — తాసిల్దార్."

అబ్బునాథం అర్థమీటరు క్రుంగిపోయాడు. ఏడు కిలోగ్రాముల బరువు కోల్పోయాడు. మూడు లీటర్ల కన్నీరు కార్చబోయి, లేడీ టైపిస్టును చూసి ఆగిపోయి, కాగితంమీద సంతకంచేసి పంపించేశాడు — ఏదో గొణుక్కుంటూ!

అతని బాధంతా గ్రహించినట్టు లేడీ టైపిస్టు అతనివంక చూసి నవ్వింది.

'ఏడ్వావ్! మొండిపీనుగా! బూడిదగుమ్మడికాయ మొహమూ, జంటపళ్ల నోరూ, గాడిద తోక జుట్టూ....నీ బతుక్కి నువ్వూ నవ్వే చావడమే!' అనుకున్నాడు అబ్బునాథం.

*   *   *   *

ఆ రోజు శనివారం. ఆఫీసులో గుమాస్తాలంతా ఎవరి పనిలో వాళ్లు మునిగిపోయిఉన్నారు. అబ్బునాథంమాత్రం పావుగంట కొకసారి ఖాండ్రిస్తూ వెలుపలికి వెళ్లివస్తున్నాడు. ఎందుకో? సాయంత్రం మూడు గంటలకు అబ్బునాథానికి టెలిగ్రాం వచ్చింది. అబ్బునాథం మొహం చేటంత అయ్యేసరికి, అతడు దాన్ని వెంటనే చీమంత చేశాడు. కంగారుపడడం మొదలుపెట్టాడు.

చుట్టూ గుమాస్తాలు పోగయ్యారు.

ఒక గుమాస్తా టెలిగ్రాం చదివాడు.

"తాతయ్యకు సీరియస్ — వెంటనే

# అబ్బునాథం అపరాధం

శ్దేరు." పాపం! అంతా సానుభూతి చూపించడం, ధైర్యం చెప్పడం వగైరాలు యాంత్రికంగా జరిగిపోయాయి. ఆఫీసులో ఈ విషయం వెంటనే వ్యాపించడమేగాక తాసిల్దారుగారికి కూడా తెలిసింది. సెలవుచీటీతో తాసిల్దారు ముందుకెళ్ళాడు. పెట్టిన నాలుగు రోజుల సెలవు సానుభూతితో మంజూరు చేశాడాయన.

అబ్బునాథం నమస్కారం చేసి "వెళ్ళొస్తా సార్!" అన్నాడు.

"అయితే నువ్వెళ్ళేదేవూరయ్యా?" అడిగాడు తాసిల్దారు.

"గుంటూరండి!"

"అరెరె! ట్రెయినుకు టైమవుతోంది. అర్జెంటుగా వెళ్ళు" అన్నాడు తాసిల్దారు. అబ్బునాథం ఆఫీసునుంచి బయటపడ్డాడు.

* * * *

సాయంత్రం ఎనిమిది గంటలకెక్కిన బండి భీమవరం చేరేసరికి తెల్లవారుజాము నాలుగు గంటలు కావచ్చింది. కైకలూరులో తిన్న అడ్డమైన గడ్డివల్లా, నిద్రలేమివల్లా అబ్బునాథానికి తలనొప్పి, వికారం ప్రారంభమయ్యాయి. చచ్చిచెడి స్టేషను బయటపడ్డాడు. గుర్రబ్బండీ ఎక్కాడు. ఆ గుర్రం — అది గడ్డికరిచిందో లేదో గాని బండీవాణ్ణి నానాగడ్డీ కరిపించింది. తద్వారా అబ్బునాథం కూడా నానాగడ్డీ కరిచి అత్తవారిల్లు జేరేసరికి ఐదున్నర గంటలు మాత్రం అయింది.

పెరటిలో నీళ్ళు జల్లుతున్న అత్తగారు హడావిడిగా లోపలికెళ్ళి కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు తెచ్చింది.

భళ్ళున డోక్కున్నాడు అబ్బునాథం.

అత్తగారు కంగారు పడిపోయింది. లోపలినుంచి మామగారూ, భార్యా బయటికి వచ్చారు హడావిడిగా.

"అదేమిటోయ్! వంట్లో బాగుండలేదా?" ప్రశ్నించాడు మామ.

"అ....బ్బె.... పరవాలేదండి!" సిగ్గుపడిపోయాడు అబ్బునాథం.

పాదప్రక్షాళన, ముఖప్రక్షాళనానంతరం అంతా లోపలికి వెళ్ళారు. అప్పటికే అత్తగారు తలగడ కోసం పక్కవేసి ఉంచింది గదిలో!

"ముందర కాసేపు విశ్రాంతి తీసుకో. తర్వాత మాట్లాడుదాం" అన్నాడు మామగారు.

అబ్బునాథం పడుకున్నాడు. కాని నిద్ర పడితేగా? అత్తగారు, భార్య ఏవో గుసగుసలాడుకుంటున్నారు. ఏమిటో? భార్య వస్తుందేమోనని ఎదురు చూశాడు...ఏడు గంటలైనా కనపడదేం? తనతో మాట్లాడదేం? ఆలోచించి ఆలోచించి బుర్ర బాగా వేడెక్కింది. తలనొప్పి ఎక్కువయింది. మామగారు కాఫీ తెచ్చాడు.

'ఇదేమిటివ్వాళ? ఎప్పుడూ తన భార్య తెచ్చేది! తను త్రాగేవరకూ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పేది! ఏమైనా పనిచేసుకుంటూందా? పనుంటే కాఫీ ఇచ్చి వెళ్ళడానికేం?'

ఎంత ఆలోచించినా కారణం దొరకలేదు అబ్బునాథానికి. తలనొప్పి మరీ ఎక్కువైంది. ఎనిమిది గంటలయేసరికి ఒళ్ళు సలపరింత...

నోరెత్తకుండా బాధపడుతున్నాడు.

తొమ్మిది గంటలైంది.

జ్వరం రానే వచ్చింది.

మరో పావుగంటలో మరో వాంతి చేసుకున్నాడు — మంచం ప్రక్కనే — అప్రయత్నంగా!

అత్తా మామలు పరుగెత్తుకు వచ్చారు. అత్తగారక్కడే ఉంది. మామగారు డాక్టరుకోసం పరుగెత్తాడు.

"ఏంనాయనా? ఏమన్నా అజీర్తి చేసిందా?" అంది అత్తగారు.

అత్తగారితో మాట్లాడ్డం అబ్బునాథానికి చచ్చే సిగ్గు.

"అబ్బె! ఏంలేదండి."

"కాసేపు నిద్ర పో నాయనా!" అంటూ వెళ్ళిపోయింది అత్తగారు.

డాక్టరు వచ్చాడు, టెంపరేచరు చూశాడు, వివరాలడిగాడు. అబ్బునాథం చెప్పాడు.

మామగారు ఒక సీసాతో డాక్టరుగారి వెంట వెళ్ళి మందు తెచ్చాడు. ఆయనే ఒక డోసు గాజుగ్లాసులో పోసిచ్చి, అది త్రాగాక పడుకుని విశ్రాంతి తీసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు. 'ఇంత జరిగినా, తన భార్య రాదేం? ఇందులో ఏదో ఉంది కిటుకు! తనమీద ఏమైనా కోపమొచ్చిందేమో? ఎందుకువస్తుంది? ఛ! ఛ! పత్తి అమాయకురాలు,పాపం!...ఆఁ! ఇదివరలో అమాయకురాలుగాని, ఇప్పుడుకూడా ఇంకా అలాగే ఉండాలని సిద్ధాంతమా? ఏది యేమైనా ఒకసారి తనని చూసిపోతే ఏం? ఫూల్!'



అంగడికి
చిత్రం—కాటూరి కృష్ణమూర్తి (నూతక్కి)

ఇహ ఇదే ఆలోచన మధ్యాహ్నం రెండుగంటల వరకూ. కొద్దిగా నిద్రపట్టింది ఆ తర్వాత.

* * * *

బయట వరండాలో ప్యూను జకరయ్య బీడీ కాలుస్తూ కూర్చున్నాడు. ఒక ముసలాయన వచ్చి "నాయనా! అబ్బునాథం ఉండేదెక్కడ?" అని ప్రశ్నించాడు.

"ఆయనగా రూళ్ళో లేరండి" అన్నాడు జకరయ్య.

"ఉహూఁ! ఏ ఊరెళ్ళారో?"

ఇంతలో ఆఫీసరు బెల్ కొట్టడం వినిపించింది.

"గుంటూరెళ్ళారండి. ఆళ్ళ తాతగార్కి ప్రాణంమీద కొచ్చిందట! టెలిగ్రాం వచ్చింది" అన్నాడు జకరయ్య లోపలి కెళ్ళబోతూ.

"ఆఁ! నాకు ప్రాణంమీది కొచ్చిందని టెలిగ్రామా! ఇదేదో దొంగ టెలిగ్రాం" అన్నాడు ముసలాయన ఆశ్చర్యం, కోపంతో.

జకరయ్య మరీ ఆశ్చర్యపడిపోయాడు.

ఇంతలో మళ్ళీ బెల్ విని లోపలికి పరుగెత్తాడు. మళ్ళీ రెండు నిమిషాలలో బయటికొచ్చి "అయ్యగారు మిమ్మల్ని లోపలికి రమ్మంటున్నారు సార్" అన్నాడు ముసలాయనతో. ముసలాయన లోపలికెళ్ళాడు.

* * * *

అబ్బునాథానికి పథ్యం పెట్టారు చారునీళ్ళతో. ఆ మరునాడే రెండు మెతుకులు కొరికాడు.

"అయ్యో! ముచ్చటగా ఇంటికి వస్తే ఓ సంతోషం లేదు. ఓ శుభ్రమైన భోజనం లేదు బిడ్డకి. దిక్కుమాలిన జ్వరం" అని అత్తగారు వాపోయింది.

ఇంతలో మామగారు దక్షిణంవైపు వరండాలో పడక్కుర్చీ వాల్చి, "అబ్బునాథం, ఆ కుర్చీలో కూర్చో! నిద్రమాత్రం పోకుసుమీ!" అన్నాడు.

అబ్బునాథం శిరసా వహించాడు. ఇంతలో కంచం కడగడానికి సుజాత అటువైపు వచ్చి అతన్ని ఓరకంట చూసింది. అబ్బునాథానికి వెయ్యేనుగుల సత్తువ గలిగింది. తను విన్నటినుంచీ చేస్తున్న తపస్సు ఫలించిందనుకున్నాడు. పిలుద్దామనుకున్నాడు. కానీ, అతని 'అహం' అడ్డు వచ్చింది. మూతి మూరెడు చేశాడు. దృష్టి మరోవైపు సారించాడు. సుజాత నెమ్మదిగా అతని వద్దకు వచ్చింది.

"ఏమండి?"

"........"

"ఎందుకండీ అంత కోపం?"

"......"

"మాట్లాడరేమండి? నేనేం తప్పుచేశాను?" అంటూ గద్దం పుచ్చుకుంది.

(తరువాయి 50 వ పేజీలో)

# అబ్బునాథం అఫరాధం

"నువ్వేం చెయ్యలేదు. నేనే చేశాను తప్పంతా" అన్నాడు మరింత బిగదీసుకుంటూ.

"అయితే మరి మాట్లాడరేం?"

"ఇన్నాళ్ళనుంచీ నువ్వు మాట్లాడావు కదూ, పాపం!" అన్నాడు కొంచెం సడలి.

"నేనేం చెయ్యను చెప్పండి? మీకా వంట్లో బాగుండలేదాయె? మా అమ్మానాన్నలు చూస్తుండగా మీదగ్గర నుంచోడానికే నాకు సిగ్గయ్యె!"

"ఊఁహూ."

"పోనీ! మీరుమాత్రం వాళ్ళుండగా నాతో మాట్లాడతారా? చెప్పండి. ఒంటరిగా వచ్చి చూద్దామా అంటే... మా అమ్మ మరీ మరీ చెప్పింది..... మీరు జ్వరంతో ఉండగా దగ్గరి కెళ్లద్దని."

"వస్తే యేమో!" అన్నాడు అబ్బునాథం అమాయకత్వం, కోపం జతచేసి.

"నేనేమీ చెప్పలేను. వాదే తప్పనుకుంటే క్షమించండి."

"ఛీ! ఏడ్చావులే!" అంటూ బుగ్గ గిల్లబోయాడు.

వెంటనే రెండడుగులు వెనక్కు వెళ్లింది సుజాత.

అబ్బునాథానికి ఆగ్రహం వచ్చింది.

సుజాతకు తల్లి పిలుపు వచ్చింది.

సుజాత పరుగుతీసింది వంటింట్లోకి.

అబ్బునాథం ఒరిగిపోయాడు కుర్చీలోకి.

( 36 వ పేజీ తరువాయి)

అంతే. ఆరోజు, మరు రోజుకూడా భార్య దర్శనమే కాలేదు.

• • •

ఆరోజు బుధవారం. అబ్బునాథం కాస్త బలం పుంజుకున్నాడు. ప్రొద్దున భార్య కాఫీ తెచ్చి ఇచ్చింది. కాస్త సంతోషపడ్డాడు.

కానీ—

ఆ మరునాడే తాను ఆఫీసులో హాజరు కావాలి. అంటే, తను మధ్యాహ్నమే బయల్దేరి రాత్రికి ఇంటికి చేరాలి. భార్యతో నాలుగుదినాలు కులాసాగా గడుపుదామని వస్తే ఏమిటీ కర్మ? పోనీ సెలవు పొడిగిద్దామా అంటే, తను గుంటూరు వెడుతున్నాననిచెప్పి వచ్చాడాయె. భీమవరం నుంచి సెలవు పొడిగిస్తే తన దొంగతనం బయటపడి తన ఉద్యోగానికే మోసం రాదూ?

భోజనం చేశాక తప్పనిసరిగా ప్రయాణం కట్టాడు. మామగారు అతన్ని మరి రెండు రోజులుండి విశ్రాంతి తీసికోవడం ఉత్తమమనీ, హోటలు భోజనంచేస్తే మళ్ళీ ఆరోగ్యం భంగం అవుతుందనీ చెప్పాడు. అబ్బునాథం ఆఫీసంటే తనకెంతో 'శ్రద్ధ' అన్నట్టు మాట్లాడాడు.

"అమ్మాయి సుజాతా! అతను తప్పనిసరిగా వెళ్ళాలట! ఇలా రామ్మా" అని కేకవేశాడు కూతుర్ని.

క్రింది చూపులు చూస్తూ వచ్చింది సుజాత. ఏం లాభం? ఒకళ్ళనొకళ్ళు చూసుకోడానికి సిగ్గుగా ఉంది. ఆఖరికి అబ్బునాథం గబగబా తన సంచీ తెరిచి, అందులోనుంచి ఒక నైలాను చీరె, జాకెట్టు, పౌడరు డబ్బా, నల్లబడి కుళ్ళిపోయిన పూలపొట్లం బయటపెట్టి, కళ్లలో నీరు క్రుక్కుకుంటూ, రుద్ధమైన కంఠంతో "ఇవి మీ అమ్మాయికివ్వండి" అని సంచీ తీసుకుని బయటకు నడిచాడు.

సుజాతకు అప్రయత్నంగా కన్నీటిధార — చెరువయింది.

అత్తగారి హృదయం బరువయింది.

మామగారికి మాట కరువయింది.

అంతే!

• • •

గురువారంనాడు అబ్బునాథం ఆఫీసుకు వచ్చి తన సీటులో కూర్చున్నాడు. తను లేని నాలుగు రోజుల్లోనూ వచ్చిన రీము కాగితాలు చూసి బెదిరిపోయాడు. తన సీటు 'అప్‌టుడేట్' చెయ్యవలసిన విషయం జ్ఞప్తికి వచ్చి వణకడం మొదలుపెట్టాడు. చుట్టుప్రక్కల గుమాస్తాలు తన వంక పదేపదే చూస్తూ, గుసగుసలాడుకుంటూ నవ్వుకుంటున్నారు. లేడీటైపిస్టు సరేసరి.

తను చేసిన తప్పు బయటపడిందా?

కళ్లు తిరగడం మొదలుపెట్టాయి.

ఇంతలో—

"అయ్యా! అయ్యగారు మిమ్మల్ని రమ్మంటున్నారండి" అన్నాడు జకరయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ.




కేశవర్ధిని

హేర్ ఆయిల్

శిరోజములను పెంచుతుంది, పోషిస్తుంది,


అందముగ చేస్తుంది

షాంపూ

కేశములను పరిశుభ్రంగా, పరిమళంగా,

ఆరోగ్యవంతంగా ఉంచుతుంది





తయారుచేయువారు :

కేశవర్ధిని ప్రాడక్ట్స్

9/100, క్రాస్‌కట్ రోడ్డు, కోయంబత్తూరు—12

ఆర్డర్ల కన్నిటికి, వివరముల కన్నిటికి శ్రీమతి ఆర్. చెల్లమ్మాళ్ పేరట వ్రాయవలెను.


# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## శోభకృతు ఉగాది నవలల పోటీలో బహుమతులు పొందినవారు



కె. లింగరాజు (హనుమకొండ)

మొదటి బహుమతి పొందిన
'మనం మిగిలేం' రచయిత



పి. అశ్వక్ (కడప)

రెండవ బహుమతి పొందిన
'మూసిన తలుపులు' రచయిత



పుట్టగుంట శ్రీ సతీశుకవాణి (సుమలత)
(రేపల్లె)

మూడవ బహుమతి పొందిన
'జీవనకలశం' రచయిత్రి

గుండె ఆగబోయింది. యాంత్రికంగా ఆఫీసరు దగ్గరి కెళ్లాడు.

"నమస్కారం సార్!"

"ఆఁ!.... ఏమయ్యా అబ్బునాథరావుగారూ! అలా నీరసంగా ఉన్నారేం? మీ తాతగారి ఆరోగ్యం ఎలా వుంది?" అన్నాడు ఆఫీసరు హేళనగా.

ఆఫీసరు మాట్లాడే తీరుచూస్తే కంగారు పుట్టింది అబ్బునాథానికి.

"ఫ.... ఫర్వాలేదండి.... కాస్త కులాసాగానే ఉన్నాడు" అన్నాడు గుండె సవరదీసుకుంటూ.

"గుంటూరు కదూ నువ్వెళ్లింది?"

"ఔనండి."

"మీ తాతగారి పేరు?"

"వెంకటరత్నంగారండి."

"కొంచెం నల్లగా ఉంటారుగదూ?"

అబ్బునాథానికి తార్.....

"అ.... వ్వునండి."

"మొహాన మచ్చ ఉంటుంది... చిన్న పిలక... కుడి ముక్కుకు బంగారంపోగు.... ఆయనే కదూ?"

అబ్బునాథానికి చెమటలు పోశాయి, గుడ్డలు తడిశాయి. నోరు తడి ఆరిపోయింది. వినబడీ వినబడనట్టుగా నిలువుగుడ్లేసి...."అవునండీ..." అన్నాడు.

"ఆయన ఇక్కడికి వచ్చి నీకీ ఉత్తర మియ్యమని చెప్పి ఇచ్చి వెళ్లారోయ్! చదువుకో" అని ఉత్తరమిచ్చాడు ఆఫీసరు. ఆఫీసరు కుర్చీతో బాటు తల్లక్రిందులైనట్టు కనిపించింది అబ్బునాథానికి... ఉత్తరం మడత విప్పలేకపోతున్నాడు. తప్పటడుగులు వెయ్యడం సాగించాడు.

"దొంగ టెలిగ్రాములు సృష్టించి ఆఫీసు పని ఎగ్గొట్టిపోయినందుకు నీమీద ఛార్జిషీట్ పెడుతున్నాను" అన్నాడు ఆఫీసరు కఠినంగా.

ఈ దెబ్బతో అబ్బునాథం క్రింద పడనే పడ్డాడు. తన ఉద్యోగం ఊడిందనుకున్నాడు. ఉద్యోగం ఊడినందుకు తన బంధువర్గమంతా అతన్ని నీచంగా, హేళనగా చూస్తున్నట్టు తపించాడు. ముఖ్యంగా తన భార్య! కన్నీరు మున్నీరుగా ఏడ్వడం మొదలుపెట్టాడు.

"ఈ ఏడ్పులు నాదగ్గర సాగవు! నిజం చెప్పు, ఎక్కడికెళ్లావో!" అరిచాడు ఆఫీసర్.

అతి కష్టంమీద, నూతిలోనుంచి మాట్లాడినట్టు, తను సెలవుపెట్టి వెళ్లి తిరిగి వచ్చేవరకూ జరిగిన విషయం పూర్తిగా పూసగుచ్చినట్టు చెప్పాడు.

"ఇంకెప్పుడూ ఇలాటి తప్పుడు పనులు చెయ్యను సార్! ఈ ఒక్కసారి నన్ను క్షమించండి" అంటూ మళ్లీ ఏడ్వడం సాగించాడు.

ఆఫీసరుకు నవ్వు వచ్చింది. అయినా అణుచుకుని, "సరేలే! ముందర నీ పని చూడు. నీ సంగతి తర్వాత తేలుస్తా! పో" అన్నాడు.

"సార్."

"గెటవుట్."

• • •

యథావిధిగా రోజులు గడుస్తున్నాయి. అబ్బునాథంమీద ఏ ఛార్జీలూ రావేలేదు. తన ప్రాణం కూడా ధారపోసి తన సీటు "అప్ టు డేట్" చేశాడు.

ఆ రోజు జనవరి ఇరవై అయిదో తారీఖు. మామూలుగా సంతకం చేద్దామని అటెండెన్సు రిజిస్టరుకోసం చూస్తే... అది హెడెకవుంటెంట్ బల్లమీద లేదు.

"అయ్యగారిదగ్గరుంది. ఎల్లండి" అన్నాడు జకరయ్య.

వెళ్లి సంతకం పెట్టబోయాడు.

"ఇప్పుడు కాదులే! తర్వాత పెడుదువుగాని" అన్నాడు ఆఫీసర్, చేతిలోని అటెండెన్సు రిజిస్టరులోకి చూస్తూ.

మళ్లీసాయంత్రంనాలుగు గంటలకు వెళ్లాడు. అప్పటికే ఆఫీసరు వెళ్లిపోయాడు. అటెండెన్సు రిజిస్టరు అక్కడ లేదు. పోనీలే! రేపు పెట్టవచ్చు లెమ్మనుకున్నాడు.

కాని, జనవరి ముప్ఫయి ఒకటవ తేదీవరకు ఇదే తంతు. అందరు గుమాస్తాలూ సంతకాలు చేస్తున్నారు. తనను చెయ్యనివ్వడంలేదు ఆఫీసరు. ఏమంటాడు? ఏమనగలడు.... తన తప్పు తనను ఎప్పటికప్పుడు బాధ పెడుతూనే ఉంది. మూగబ్రతుకయింది.

ఫిబ్రవరి ఒకటవ తేదీన సంతకం చేశాడు. కాని ఆఫీసరు ఆ రోజు అడ్డు చెప్పలేదు. జనవరిలో చివరి వారంరోజులకు సంతకం పెడదామని కాగితం వెనక్కితిప్పి చూస్తే ఆ వారం రోజులు సెలవు మార్కుచేసి ఉంది.

"అబ్బునాథం! జనవరి ఇరవై అయిదునుంచి ముప్ఫయి ఒకటివరకూ నీకు కాజువల్ లీవు కావాలని ఒక లీవులెటరు వ్రాసియ్యి" అన్నాడు ఆఫీసరు నవ్వుతూ.

"అదేమిటి సార్! నేను...."

"ఇక మాట్లాడకు! ఇదిగో కాగితం. ఊఁ. రాసియ్యి. తప్పదు...."

"..........."

"దొంగ టెలిగ్రాములు సృష్టించి నీ ఇష్టం వచ్చినట్టు సెలవుపెట్టి పారిపోతావా డ్యూటీలోనుంచి? మరొక ఆఫీసరయితే....ఎప్పిపాటికి నిరుద్యోగిగా చేసుండేవాడు.... జాగ్రత్త." అరిచాడు ఆఫీసరు.

అబ్బునాథం మారుమాట్లాడకుండా సెలవు చీటీ వ్రాసిచ్చాడు—ఆఫీసరు చెప్పినప్రకారం. ఆఫీసరు సెలవు మంజూరు చేశాడు. అబ్బునాథం అలాగే నిలబడ్డాడు.

"ఇహపో! నీ జలుబునీరు దిగిపోయింది" అన్నాడు ఆఫీసరు నవ్వుతూ.

బయటికి వచ్చి లెంపలేసుకున్నాడు అబ్బునాథం.

స్తంభం చాటున నిలబడి నవ్వుతున్నాడు జకరయ్య. ★